క్లుప్తంగా

ముందస్తు అడ్మిషన్లు ఆపండి



ఎంఈఓకు వినతి పత్రం అందిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

హిందూపురం: హిందూపురం వ్యాప్తంగా కార్పొరేట్ విద్యా సంస్థలు పోటాపోటీగా ప్రకటనలు చేస్తూ, ఉపాధ్యాయులను విద్యార్థుల ఇళ్లకు పంపి చేస్తున్న ముందస్తు అడ్మిషన్లను ఆపాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు ఈరేష్, కన్వీనర్ అఫ్రిది, కో కన్వీనర్ అజ్మల్ తదితరులు ఎంఈఓ గంగప్పకు ఫిర్యాదు చేశారు. గురువారం ఎంఈఓ కార్యాలయంలో వారు మాట్లాడారు. హిందూపురం వ్యాప్తంగా విచ్చలవిడిగా కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు ముందస్తు అడ్మిషన్లు చేస్తున్నారని ఈవిషయంగా ఇదివరకే విద్యాశాఖ అధికారులకు తెలియజేసినా పట్టించుకోలేదన్నారు. ఇలాగే ముందస్తు అడ్మిషన్లు చేస్తే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఇస్మాయిల్, ఉమేష్, ఉజఫా, రజాక్ పాల్గొన్నారు.

పరిగి ఎంపీడీఓగా రెడ్డెప్ప



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎంపీడీఓ రెడ్డెప్ప

పరిగి: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓగా పి.రెడ్డెప్ప గురువారం బాధ్యతలు స్వీకరించారు. తనకల్లు మండల పరిషత్ కార్యాలయంలో ఏఓగా పని చేస్తున్న ఈయన పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు.ఈ సందర్భంగా కార్యాలయ అధికారులు, సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలను అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఏఓ అశ్వత్థప్ప, పంచాయతీ కార్యదర్శులు, సెక్రటరీలు పాల్గొన్నారు.

నేడు నాగలూరులో 'కాఫీ విత్ వైఎస్సార్‌సీపీ'

పెనుకొండ రూరల్: మండలంలోని నాగలూరు గ్రామంలో శుక్రవారం ఉదయం 6 గంటలకు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉష శ్రీ చరణ్‌కాఫీ ఆధ్వర్యంలో విత్ వైఎస్సార్‌సీపీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈమేరకు ఆ పార్టీ పట్టణ, మండల కన్వీనర్లు నరసింహులు, సుధాకర్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులు, అభిమానులు, అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

శ్రీరామ ఆలయ నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న హనుమంతనాథ స్వామిజీ

అగళి: మండలంలోని రామపురం గ్రామంలో నూతనంగా నిర్మించబోతున్న శ్రీరామ ఆలయ నిర్మాణానికి గురువారం ఏలేరాంపురం పీఠాధిపతి హనుమంతనాథ్ స్వామీజీ భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి, మండల కన్వీనర్ స్టూడియో శ్రీనివాస్, జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షుడు మహేంద్రప్ప, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ జయకుమార్, నాయకులు తిమ్మరాయప్ప, గంట నాగరాజు, శీనప్ప, శివన్న తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు




ఆలయంలోకి ప్రవేశిస్తున్న భక్తులు

అమరాపురం: మండలంలోని నడులుడం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయం ప్రవేశం, పూజా కార్యక్రమాలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు మంత్రోచ్ఛారణల నడుమ హోమం, గణపతి పూజ చేశారు. సాయంత్రం మహిళలు గంగాజలంతో ఊరేగింపుగా ఆలయంలోకి ప్రవేశించి కలస స్థాపన చేశారు. గణవాస్తు హోమం కూడా చేశారు. భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

హిందూపురం: పరిగి మండలం పెదిరెడ్డిపల్లికి చెందిన నాగరాజు (57) చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. నాగరాజు హిందూపురం సమీపంలోని మోత్కుపల్లి వద్ద గత నెల 2న సాయంత్రం ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా, మరో ద్విచక్రవాహనం ఢీకొనింది. ఈప్రమాదంలో నాగరాజు కిందపడి తీవ్ర గాయాల పాలయ్యాడు. అతన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, మెరుగైన చికిత్స కోసం బెంగళూరు మణిపాల్ ఆసుపత్రికి తరలించారు. వారం రోజులుగా చికిత్స పొందుతూ గురవారం సాయంత్రం మృతి చెందినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేస్తుకుని దర్యాప్తు చేపట్టారు.



పేదలపై కూటమి కక్ష

- ఇంటి వద్దే వైద్య సేవలకు మంగళం
- దివ్యాంగులు, వృద్ధుల ఇబ్బందులు



ఆర్.అనంతపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్యులు బీపీ పరీక్ష చేస్తున్న దృశ్యం(ఫైల్)

మడకశిరరూరల్: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో పేదలకు ఇంటి వద్దకే వైద్య సేవలందించే పథకానికి కూటమి ప్రభుత్వం మంగళం పాడింది. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో మంచానికే పరిమితమైన దివ్యాంగులు, వృద్ధులు వైద్య సేవల కోసం ఇబ్బందులు పడుతున్నారు. పేదలకు సంక్షేమ పథకాలతో పాటు ఉచితంగా విద్య, వైద్యం అందించగలిగితే సమాజం అభివృద్ధి చెందుతుందని ముందు చూపుతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాలనలో ఇంటింటా వైద్య సేవలను అందించే కార్యక్రమం నిర్వహించారు. అలాగే జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా గ్రామాల్లో ఇంటింటా వైద్య సిబ్బంది వెళ్లి పరీక్షలు నిర్వహించి, అవసరమున్న వారికి వైద్య సేవలను అందించేవారు. ప్రతి నెలా కేటాయించిన పంచాయతీలో వైద్యులు, సిబ్బంది వెళ్లి 14 రకాల వ్యాధులకు వైద్య పరీక్షలు చేసి అవసమున్న వారిని గుర్తించి చికిత్సలు చేసి ఉచితంగా మందులు అందించేవారు. ఎవరికైనా మెరుగైన వైద్య సేవలు అవసరమైతే సమీపంలో వైఎస్సార్ ఆరోగ్య శ్రీ ఆస్పత్రికి తరలించేవారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఈ సేవలకు మంగళం పాడింది. అనారోగ్య సమస్య వస్తే ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తుందని బాధితులు వాపోతున్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రజారోగ్యానికి ప్రాధాన్యత..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యత కల్పించి పైసాఖర్చు లేకుండా ఇంటి వద్దకే జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా వైద్య సేవలు అందించారు. ప్రతి గ్రామ, వార్డు సచివాలయ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహించి వైద్య పరీక్షలు, చికిత్సలు ఉచితంగా మందులు అందించేవారు. ఒక వేళ ఎవరికైనా శస్త్ర చికిత్సలు అవసరమైతే ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్సలు చేయించేందుకు కార్పొరేట్ ఆస్పత్రులకు తరలించేవారు. దీర్ఘకాల వ్యాధులతో బాధపడేవారికి పైసా ఖర్చు లేకుండా నాణ్యమైన వైద్య సేవలను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రజారోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాడం లేదని గ్రామీణులు ఆవేదన వ్యక్తం చేశారు.

గతంలో ఇంటి వద్దే వైద్య సేవలు



గత వైఎస్సార్‌సీపీ హయాంలో నెలకు ఒక సారి వైద్య సిబ్బంది ఇంటికి వచ్చి వైద్య సేవలు, పరీక్షలు చేసి ఉచితంగా మందులు ఇచ్చేవారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం వృద్ధులు, దివ్యాంగులు, పేదలకు వరంగా ఉండేది. ప్రస్తుతం ఆరోగ్యం బాగా లేకపోతే మడకశిర ఆస్పత్రికి వెళ్లాల్సి ఉంది.

– వెంకటేష్, మడకశిర

ఉపయోగకరంగా వైద్య శిబిరాలు



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గ్రామాల్లో ప్రజల ఇంటికి వైద్య సిబ్బంది వచ్చి వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు ఇచ్చేవారు. అదే విధంగా కంటి చూపులేనివారికి కంటి పరీక్షలు నిర్వహించేవారు. ప్రస్తుతం అలాంటి పరిస్థితి లేక పోవడంతో ఎవరికైనా ఆరోగ్యం బాగా లేకపోతే మడకశిర ఆస్పత్రికి వెళ్లాల్సి వస్తోంది.

– నరసింహ, మడకశిర

వైఎస్ జగన్‌ను కలసిన నాయకులు



మాజీ సీఎం వైఎస్ జగన్‌తో మాజీ మంత్రి నర్సేగౌడు, సమన్వయకర్త ఈరలక్కప్ప

మడకశిరరూరల్: తాడేపల్లి కేంద్ర పార్టీ కార్యాలయంలో గురువారం మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మాజీ మంత్రి హెచ్‌బీ నర్సేగౌడు, సమన్వయకర్త ఈరలక్కప్పతో పాటు మడకశిర మున్సిపాలిటీ వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు, నాయకులు తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ప్రజాప్రతినిధులు సమావేశంలో పాల్గొన్నారు. గ్రామ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయాలని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించినట్లు వారు తెలిపారు.



ఉష్ణోగ్రత సమాచారం

హిందూపురం	36.0
పెనుకొండ	39.0
మడకశిర	36.0

కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు



హిందూపురం డీటీ మైనుద్దీన్‌కు వినతిపత్రం అందిస్తున్న పత్రికా ప్రతినిధులు, జర్నలిస్టు సంఘ నాయకులు

- సాక్షి ఎడిటర్ నివాసంలో ఖాకీల జులుంపై నిరసన

హిందూపురం: కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం సరికాదని హిందూపురం పాత్రికేయులు అన్నారు. గురువారం హిందూపురం పాత్రికేయులు పత్రికా స్వేచ్ఛపై జరుగుతున్న దాడులకు నిరసనగా నల్లబ్యాడ్జీలు ధరించి మోకాళ్లపై నిరసన తెలియజేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ మైనుద్దీన్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతికా స్వేచ్ఛను హరిస్తోందన్నారు. సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డి ఇంట్లోకి పోలీసులు చొరబడి ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా సోదాలు చేయడం సరికాదన్నారు. ప్రజల సమస్యలపై నిరంతరం శ్రమించే జర్నలిస్టులపై పోలీసుల వేధింపులు తగవన్నారు. సాక్షి ఎడిటర్ ధనుంజయ రెడ్డి ఇంట్లో అనుమతి లేకుండా సోదాలు చేయడం కేవలం కక్ష సాధింపు చర్య అన్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలిని కోరారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శి ప్రశాంత్, పాత్రికేయులు షబ్బీర్, అల్లీపీరా, చంద్రశేఖర్ రెడ్డి, లక్ష్మిరెడ్డి శ్రీధర్‌రెడ్డి, రాజేష్, ప్రకాష్, గిరి, గంగప్ప, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయండి



పార్టీ కార్యాలయంలో సమన్వయకర్త దీపికను సత్కరించిన దృశ్యం

చిలమత్తూరు: పార్టీని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక సూచించారు. గురువారం సాయంత్రం హిందూపురంలోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులు పార్టీ సమన్వయకర్త దీపికను కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. మహిళా విభాగం నియోజకవర్గ అధ్యక్షురాలు కవిత రెడ్డి , అంగన్‌వాడీ విభాగం అధ్యక్షురాలు కురుబ సిద్ద గంగమ్మ సమన్వయకర్తను శాలువా, పూలమాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు మహేష్ గౌడ్, జిల్లా కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, మంజునాథ్, దేవరాజు, రుద్రప్ప, నరసింహామూర్తి తదితరులు పాల్గొన్నారు.

కోర్టు ఉత్తర్వులు అమలు చేయాలి



ఆర్డీఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పెనుకొండ రూరల్: కోర్టు ఉత్తర్వులు అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కోరారు. గురువారం ఆర్డీఓ ఆనంద్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సోమందేపల్లి మండలం నల్లగొండ్రాయనిపల్లి వద్ద సర్వే నంబర్ 700లో దాదాపుగా 150 మంది గుడిసెలు వేసుకొని జీవనం సాగిస్తున్నారన్నారు. అందుకు సంబంధించి కోర్టు స్టే ఆర్డర్ ఉన్నప్పటికీ బుధవారం రెవెన్యూ, పంచాయతీ అధికారులు దౌర్జన్యంగా తొలగించడం సరికాదన్నారు. నాయకులు బాలస్వామి, రమేష్, రాజగోపాల్, చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఆర్మీకి మద్దతుగా పూర్ణహుతి హోమం

మడకశిరరూరల్: ఆపరేషన్ సింధూర్ విజయవంతంతో రెండో రోజు గురువారం ఆర్మీ సైనికులకు మద్దతుగా నీలకంఠాపురం గ్రామంలోని నీలకంఠేశ్వర ఆలయంలో పూర్ణ హుతి హోమం నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకగా పాక్ ఉగ్రవాద స్థావరాలపై భారత్ చేసిన మెరుపు దాడి విజయవంతం కావడం హర్షనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి రఘువీరారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



మహిళా చట్టాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

రొద్దం: ప్రతి మహిళకు చట్టాలు, హక్కులపై అవగాహన అవసరమని అనంతశక్తి సొసైటీ సీఈఓ లావణ్య అన్నారు. గురువారం కంబాలపల్లిలో అనంతశక్తి సొసైటీ న్యాయసలహాల మండలి ఆధ్వర్యంలో మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. గృహహింస, వేధింపులు, బాల్యవివాహాలు, సమాజంలో మహిళల చట్టాలను వివరించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షురాలు, పాలకవర్గం, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీడీఓ బాధ్యతల స్వీకరణ



ఎంపీడీఓను కలిసిన కార్యదర్శులు

సోమందేపల్లి: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీడీఓ వెంకటలక్ష్మమ్మ బాధ్యతలు చేపట్టారు. ఈమె గతంలో ఈఓఆర్డీగా ఇదే మండలంలో పనిచేశారు. ప్రస్తుతం శింగనమలలో ఉంటూ పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. స్థానిక సర్పంచ్ గంగాదేవి, పంచాయతీ కార్యదర్శులు కొత్త ఎంపీడీఓను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అందరి సహకారంతో మండల అభివృద్ధికి కృషి చేస్తానని ఎంపీడీఓ తెలిపారు.

యోగాతో మానసిక సామర్థ్యం పెంపు

కనగానపల్లి: రోజూ యోగా చేయడం ద్వారా పిల్లలలో శారీరిక, మానసిక సామర్థ్యం పెంపొందుతాయని యోగా గురువు సుబ్బరాయుడు తెలిపారు. కనగానపల్లి యోగాసనా స్పోర్ట్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో వేసవి సెలవుల్లో భాగంగా ఉచిత యోగా శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక పాఠశాలలో రోజూ 50 మంది పిల్లలు యోగాసనాలపై శిక్షణ పొందుతున్నారన్నారు. ఇందులో శిక్షణ పొందిన వారికి జిల్లా, రాష్ట్ర స్థాయి యోగాసన పోటీల్లో పాల్గొనేందుకు అవకాశం కల్పిస్తామని యోగా గురువు తెలిపారు. ఈనెల 23 తేదీ వరకు జరిగే శిక్షణా కార్యక్రమాన్ని యోగసనా స్పోర్ట్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు రాధిక పరిశీలించనున్నారని తెలిపారు.



డాక్టర్ లేకుండా వైద్య సిబ్బంది మొక్కుబడిగా కార్యక్రమం నిర్వహిస్సు దృశ్యం



ఇనగలూరులో రోడ్డుపై నిలిచిన మురుగునీరు



ఆలూడిలో రోడ్డుపై నెలకొన్న అపరిశుభ్రత

వామ్మో.. దోమలు!

- పల్లెల్లో పడకేసిన పారిశుధ్యం
- దోమల నివారణ చర్యలు అంతంతమాత్రమే
- రోగాల బారిన పడుతున్న జనం

అగళి: పల్లెల్లో పారిశుధ్యం పడకేసింది. రోడ్లు, వీధుల్లో మురుగునీరు నిలిచి దోమల బెడద అధికమైంది. పారిశుధ్యం మెరుగునకు చర్యలు చేపట్టాల్సిన అధికారులు..పట్టించుకోవడంలేదు. ఫలితంగా జనం రోగాల బారిన పడుతున్నారు. మండలంలోని గ్రామాల్లో పారిశుధ్యం లోపించింది. వాతావరణంలో మార్పుతో ఇటీవల వర్షాలు కురిశాయి. దీనికితోడు తోడు వర్షపునీరు ఎక్కబడితే రోడ్లపై నిలిచి అపరిశుభ్రత నెలకొంది. కొన్ని ప్రాంతాల్లో చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలతో కుప్పలుగా పేరుకుపోయి దోమలు వృద్ధి చెందుతున్నాయి. దీంతో దోమల బెడద అధికమైంది. సాయంత్రం నాలుగు గంటలు దాటితే బయట కొచ్చి ప్రజలపై దాడి చేస్తున్నాయి. సాధారణంగా వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాల్లో వర్షం నీరు నిలిచి, భూమి తడిబారి ఎక్కువ రోజులు తేమ ఉండడం వల్ల దోమలు వృద్ధి చెందేవి. ప్రస్తుతం వేసవి అయినా కొన్ని రోజులుగా అన్ని ప్రాంతాల్లోనూ దోమలు సమస్య ఎక్కువైంది. దోమల వల్ల ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. మండలంలో గ్రామల్లో సీజన్‌ల వ్యాధుల వ్యాపిస్తున్నా గ్రామాల్లో ఫాగింగ్ చేయించలేదు. పంచాయతీల్లో తగినంత మంది పారిశుధ్య సిబ్బంది లేక వేతనాలు చెల్లించక మందు దోమల మందు పిచికారీ చేయడం లేదు. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.


భరించలేకపోతున్న జనం ..

దోమ కుడితే చర్మం విపరితమైన మంట పుడుతోంది. కుట్టిన చోట చర్మం మంట పుట్టి, దద్దుర్లు వస్తున్నాయని ప్రజలు వాపోయారు. దోమల నివారణకు రూ.100 వెచ్చించి మస్కిటో కాయిల్స్ వెలిగిస్తున్నా, లిక్విడ్ మెషీన్లు పెడుతున్నా ప్రయోజనం లేకుండా పోతోందంటున్నారు.

ఫొటోలకే పరిమితం ..

మండలంలో పారిశుధ్యం లోపిచింది. ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ, ఆరోగ్య సిబ్బంది సమన్వయ లోపంతో పారిశుధ్యం మెరుగునకు చర్యలు చేపట్టలేదు. మొక్కుబడిగా పారిశుధ్య పనులు చేయిస్తున్నారు. అధికారులు ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా వ్యవహరిస్తుండటంతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. మలేరియా నివారణ కార్యక్రమాలు,పారిశుధ్యకార్యక్రమాలు, స్వచ్ఛ కార్యక్రమాలు, ఆరోగ్య పరమైన కార్యక్రమంలో ఫొటొలకు పరిమితం అయ్యారన్న విమర్శలు వస్తున్నాయి.

ప్రత్యేక చర్యలు చేపట్టాలి



ప్రస్తుతం విపరీతంగా పెరిగిపోయిన దోమల నివారణకు ప్రభుత్వం గ్రా పంచాయతీల ద్వారా ప్రత్యేక చర్యలు చేపట్టాలి.మందు స్ప్రేయింగ్ కార్యక్రమాన్ని తరుచూ విస్తృ తంగా చేపట్టి దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి.

– మైలారప్ప, ఇనగలూరు గ్రామం, అగళి మండలం

క్షయపై అవగాహన అవసరం



క్షయపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సోమశేఖర్‌రెడ్డి

రొద్దం: ప్రతి ఒక్కరూ క్షయవ్యాధిపై అవగాహనతో ఉండాలని డాక్టర్ సోమశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆర్ లోచెర్ల గ్రామంలో ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా వ్యాధిపై అవగాహన కల్పించారు. వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన చర్యలు, నివారణ పద్ధతులు వివరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గంగాధర్, సీహెచ్‌ఓ విజయలక్ష్మి, పెనుకొండ ల్యాబ్ టీబీ సూపర్‌వైజర్ శశిధర్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మార్సీకి చేరిన పాఠ్య పుస్తకాలు

అగళి: 2025–2026 విద్యాసంవత్సరానికి సంబంధించి 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకూ 19,310 పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు 10,830 మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయానికి చేరాయని ఎంఈఓ చంద్రశేఖర్‌నాయుడు తెలిపారు. త్వరలో వాటిని ప్రధానోపాధ్యాయులకు పంపిణీ చేస్తామన్నారు.

ఆలయ ప్రారంభోత్సవాలకు తరలిరండి



వివరాలు వెల్లడిస్తున్న అయ్యప్పస్వామి ఆలయ ట్రస్ట్ గురుస్వామి పీజే విజయ్‌కుమార్

ధర్మవరం అర్బన్: కేశవనగర్‌లో నూతనంగా నిర్మించిన అయ్యప్పస్వామి ఆలయ ప్రారంభోత్సవాలకు భక్తులు తరలిరావాలని అయ్యప్పస్వామి ఆలయ ట్రస్ట్ గురుస్వామి పీజే విజయ్‌కుమార్ కోరారు. గురువారం ఆలయంలో ఆయన కమిటీ సభ్యుడు బండ్లపల్లి వెంకట జయప్రకాష్ తదితరులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఆలయ ప్రారంభోత్సవంలో భాగంగా ఈనెల 10న మహాగణపతి పూజ, హోమాలు, ప్రత్యేక పూజలు, 11న ప్రత్యేక హోమాలతోపాటు సాయంత్రం మూలమూర్తుల గ్రామోత్సవం ఉంటుందన్నారు. 12, 13 తేదీల్లో హోమాలు, పూజలు, 14న మహాగణపతి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, వేంకటేశ్వరస్వామి, మహాలక్ష్మి, నవరత్నలింగ, నవగ్రహామూర్తుల సహిత హరి హర పుత్ర అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠ, మహాకుంభాభిషేకం జరుగుతుందని వివరించారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు



అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ మహేష్

ధర్మవరం అర్బన్: ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని ఆర్డీఓ మహేష్ హెచ్చరించారు. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో గురువారం అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ఇసుక అక్రమ రవాణాను నియంత్రించడానికి నియమించిన మండలస్థాయి సిబ్బందికి అక్రమ రవాణా నివారణ చర్యలు, అమలులో తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఇసుక అక్రమ రవాణా జరిగినట్లు తేలితే రవాణా చేసే వ్యక్తులు, వాహనాలను సీజ్ చేసి వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టడానికి ప్రజలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. మండలస్థాయి అధికారులు ఎప్పటికప్పుడు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ఇసుక అక్రమ రవాణా జరగకుండా కట్టడి చేయాలని ఆదేశించారు. గనులశాఖ, ఇరిగేషన్, తహసీల్దార్లు, ఇసుక రవాణా పర్యవేక్షక ఇన్‌చార్జ్‌లు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.